



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

సోమవారం 4 ఆగస్టు 2025 పేజీలు 8




### వంట గ్యాసుతో వ్యాపార మంట

# అక్రమ దందాతో ఏజెన్సీల పంట



- గృహేతర అవసరాలకు తరలింపు
- సిలిండర్ ధరపై అదనపు వసూళ్లు
- అక్రమం, చట్టవిరుద్ధం, ప్రమాదకరం
- కొరవడిన పౌరసరఫరాల "నిఘా"

వివరాలు 2లో

### అంగన్వాడీ కేంద్రాలకు

# నాసిరకం కోడిగుడ్లు



- గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు, బాలింతలకు నాసిరకం కోడిగుడ్లు
- తేటతెల్లమవుతున్న అధికారుల పర్యవేక్షణ లోపం

**కంచికచర్ల, ఆగస్టు 3, మేజర్ న్యూస్ :** అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు ఇచ్చే కోడిగుడ్లలో నాసిరకం స్పష్టంగా కనిపిస్తుందని విమర్శలు వస్తున్నాయి. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి కోడి గుడ్డు 50 గ్రాములు గుడ్ల ట్రై మొత్తం 1500 గ్రాములు ఉండాల్సి ఉంది. అంగన్వాడీ కేంద్రాలకు పంపిణీ చేస్తున్న కోడిగుడ్లు అందుకు భిన్నంగా నాసిరకంగా ఉన్నట్లు తెలుస్తోంది. గర్భిణి స్త్రీలకు,చిన్న పిల్లలకు ఇలాంటి కోడిగుడ్లు పెడితే వారికి ఎలాంటి పోషకాలు అందుతాయనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పోషకాలు మాట దేవుడెరుగు నాసిరకం మిగతా 2లో

# అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- అంగరంగ వైభవంగా మైలవరం ఏఎంసీ ప్రమాణస్వీకారం
- ముఖ్యఅతిథులుగా ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్
- ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన ఎంపీ, ఎమ్మెల్యే, ఏఎంసీ చైర్మన్
- ఏఎంసీ చైర్మన్ పి.నవ్యశ్రీ కి శుభాకంక్షలు తెలిపిన ఎంపీ, ఎమ్మెల్యే



**జి కొండూరు మేజర్ న్యూస్ :** గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీలకు పునర్వైభవం తీసుకువచ్చేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి రాష్ట్రాభివృద్ధితో పాటు రైతుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. మైలవరంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతన ఏ.ఎం.సి పాలకవర్గ సభ్యులు ఆదివారం ప్రమాణస్వీకారం కార్యక్రమం జరిగింది. ఏ.ఎం.సి చైర్మన్‌గా ప్రమాణాస్వీకారం చేసిన జనసేన పార్టీకి చెందిన పొనకళ్ల నవ్యశ్రీతోపాటు కమిటీ సభ్యులకు ఎంపీ కేశినేని శివనాథ్ , ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ శుభాకంక్షలు తెలిపారు. ముందుగా మైలవరం పట్టణంలో ప్రధాన సెంటరులో ఎన్టీఆర్ విగ్రహానికి మిగతా 2లో...

# స్వచ్ఛ విజయవాడ సాధించుకుందాం...




- పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి...
- ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించుకుందాం...
- భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందిద్దాం...
- ఔత్సాహిక కళాకారులతో సాంప్రదాయ నృత్య ప్రదర్శన పోటీలు

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** పర్యావరణ పరిరక్షణకై జిల్లా యంత్రాంగం, నగరపాలక సంస్థ వివిధ రూపాల్లో ప్రజలను చైతన్యవంతం చేసేందుకు కార్యక్రమాలు నిరంతరాయంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. స్వచ్ఛ విజయవాడ సాధనలో భాగంగా జిల్లా యంత్రాంగం, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో హరిత బెరం పార్కులో సంప్రదాయ నృత్య పోటీలను జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర మిగతా 2లో...

(మొదటిపేజీ తరువాయి)

## అంగన్వాడీ కేంద్రాలకు నాసిరకం కోడిగుడ్లు

కోడిగుడ్డు తింటే పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు ఏమైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇటువంటి పోషక ఆహారాలపై సీడీపీవో, సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తుంది.నాసిరకం కోడిగుడ్లు ఎక్కువగా అంగన్వాడీ కేంద్రాల్లోనే కనిపించడం గమనార్హం. గుడ్డు చిన్న సైజులో ఉండి చిన్న బాలు మాదిరిగా దర్శనం ఇవ్వడం విశేషం.పిల్లలకు ఇలాంటి ఆహారం పెడితే పోషకాలు అందకపోగా ఎదుగుదల లోపం జరిగే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భావితరాల్లోకి అడుగు పెడుతున్న పసి పిల్లలకు, తల్లులకు, గర్భిణీ స్త్రీలకు ఇలాంటి కోడిగుడ్లు ఇస్తున్నారా అని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా ఈ నాసిరకం గుడ్ల ద్వారా చిన్నపిల్లలకు,బాలింతలకు,గర్భిణీ స్త్రీలకు పోషకాలు అందగపోగా ఉన్న పోషకాలు పోయే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత జిల్లా,నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు అంగన్వాడీలకు పంపిణీ చేస్తున్న కోడిగుడ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

## స్వచ్ఛ విజయవాడ సాధించుకుందాం...




ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని ఔత్సాహిక నృత్య కళాకారులు తమ తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించేందుకు ఇటువంటి వేదికలు దోహదపడతాయ న్నారు. విజయవాడ నగరం ప్రతిభావంతులైన కళాకారులకు కేంద్రంగా ఉందన్నారు. సాంస్కృతిక, సాహిత్య, సామాజిక సేవ... ఏ రంగాన్ని తీసుకున్నా ప్రపంచ స్థాయిలో ఎంతోమంది నగరం నుంచి వారి ప్రస్థానం ప్రారంభించారని గుర్తు చేశారు. పర్యావరణ పరిరక్షణపై తరచుగా ఇటు వంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజలలో అవగాహన పెరుగుతుందన్నారు. ఇప్పటికే నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం కొనసాగుతోందన్నారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల పర్యావరణానికి హాని జరగడమే కాకుండా నగర ప్రజలు ఆరోగ్య సమస్యలు కూడా ఎదుర్కొంటారన్నారు. బాలబాలికల్లో పర్యావరణం పై అవగాహన పెంపొందించేందుకు మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.




నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర మాట్లాడుతూ ప్లాస్టిక్ ఉత్పత్తుల నిరోధంపై ప్రజలలో చైతన్యం పెంచేందుకు వివిధ కళారూపాలతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించడంలో భాగంగా వరుసగా ఐదు ఆదివారాలు ఈ నృత్య పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలలో వయస్సుల వారీగా కళాకారులు తమ ప్రదర్శనలు ఇస్తున్నారన్నారు. ఇటువంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం స్వచ్ఛ విజయవాడ సాధన కోసమేనన్నారు. ఐదవ ఆదివారం విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. జాయింట్ కలెక్టర్ యస్. ఇలక్కియ, మేరీటైం బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.





# వంట గ్యాసుతో వ్యాపార మంట





**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండలంలో గృహావసర సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు వాణిజ్య అవసరాలకు తరలిపోతున్నాయి. ఏజెన్సీలే డోర్ డెలివరీ బాయ్స్‌తో అక్రమ గ్యాస్ దందా నిర్వహిస్తూ పౌరసరఫరాకు గండికొడుతు న్నాయి. డోర్ డెలివరీలో సబ్సిడీ సిలిండర్ ధరపై అదనపు వసూళ్లు చేయిస్తూ చేతివాటం ప్రదర్శిస్తున్నాయి. సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు వాణిజ్య అవసరాలకు తరలిపోతుండడంతో ప్రభుత్వం భారీగా నష్టపోతోంది. పర్యవేక్షణ చేయాల్సిన పౌరసరఫరాల శాఖ సబ్సిడీ సిలిండర్ల అక్రమ దందాపై మౌనం దాల్చింది.

### వాణిజ్యానికి సబ్సిడీ సిలిండర్లు

టిఫిన్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, టీ, బిర్యానీ స్టాల్స్, హోటళ్లు, మెస్సులు, కేటరింగ్, ఇతర వ్యాపారాల్లో సబ్సిడీ గ్యాస్ వినియోగిస్తున్నారు. వీరికి దాదాపు వారానికి మూడు నుండి పది సిలిండర్‌లు అవసరం అవుతాయి. అలాగే కార్లలో ఇతర వాహనాల్లో పెట్రోలుకు బదులుగా సబ్సిడీ సిలిండర్లను వినియోగం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం అనుమతి పొందిన కిట్‌లను అమర్చుకోవాల్సి ఉన్నప్పటికీ సబ్సిడీగ్యాస్ వినియోగించే కిట్‌లను బిగించుకొని దర్జాగా వాడుకుంటున్నారు. కొంతమంది సబ్సిడీ సిలిండర్ల నుండి చిన్న చిన్న గ్యాస్ స్టవ్‌లలో రీఫిల్లింగ్ చేస్తూ రీఫిల్‌కు రూ.100 నుంచి రూ. 150 వరకు తీసుకొని విక్రయిస్తున్నారు. దీపం పథకం కింద ఇచ్చిన కనెక్షన్లు పెద్ద సంఖ్యలో మూలన పడడంతో ఏజెన్సీలు వినియోగదారుల పేరుమీద బుక్ చేసి ఎక్కువ ధరకు వాణిజ్య అవసరాలకు విక్రయిస్తూ సబ్సిడీ సిలిండర్లను పక్కదారిపట్టిస్తున్నాయి.

### ఏజెన్సీలే బాయ్స్ తో అక్రమదందా ..

ఏజెన్సీలే డోర్ డెలివరీ బాయ్స్‌తో అక్రమ గ్యాస్ దందా నిర్వహిస్తున్నాయి. వినియోగదారులకు స్టాక్ లేదంటూ బహిరంగ మార్కెట్లో సబ్సిడీ సిలిండర్లను ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాయి. రెండు కిలోమీటర్ల వరకూ ఫ్రీ డోర్ డెలివరీ చేయాల్సిన ఏజెన్సీలు సిలిండర్ల ధరపై డోర్ డెలివరీ పేరుతో 30 నుండి 50 రూపాయల అదనపు ధరను వసూలుచేయిస్తున్నాయి. అదనంగా ఎందుకు యివ్వాలని అడిగిన వినియోగదారులకు డోర్ డెలివరీ నిరాకరిస్తూ పలు యిబ్బందులకు గురిచేస్తున్నాయి. గుడివాడ ఏజెన్సీలు తమ వాహనాల్లో గుడ్లవల్లేరులోని యిళ్ళవద్దకే వస్తూ 100 రూపాయలు, కొన్ని ఆటోలు, ప్రైవేటు వాహనాలు సబ్సిడీ గ్యాస్ సరఫరా చేస్తూ సిలిండరుకు 200 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నాయి.

### అక్రమం, చట్టవిరుద్ధం, ప్రమాదకరం

గృహావసర గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగించడం అక్రమం, ప్రమాదకరం, చట్టవిరుద్ధం. వాణిజ్య అవసరాల సిలిండర్ల ధరలు, పరిమాణాలు వేరుగా ఉంటాయి. గృహావసర సిలిండర్లు వాణిజ్య అవసరాలకు తగినంత బరువు, సామర్థ్యం కలిగి ఉండక ప్రమాదాలకు దారితీయవచ్చు. సబ్సిడీ సిలిండర్లను పక్కదారి పట్టించి వాటిని అధిక ధరలకు విక్రయించడం, వాణిజ్య అవసరాలకు వినియోగించడం, బ్లాక్ చేసి పౌరసరఫరాకు గండికొట్టి ప్రభుత్వానికి నష్టం కలిగించడం, ప్రజా రవాణా వాహనాల్లో గ్యాస్ సిలిండర్లు తరలించడం, సిలిండర్ల ధరలపై అదనపు వసూళ్ళకు పాల్పడడం, వినియోగదా రుల హక్కులు హరించడం అక్రమ కార్యకలాపాలక్రింద చట్టవిరుద్ధం. గ్యాస్ ఏజెన్సీలు, అధికారులు గృహావసర సిలిండర్ల అక్రమ వినియోగంపై నిఘా ఉంచి అటువంటి చర్యలకు పాల్పడిన వారికి జరిమానాలు విధించవచ్చు. వాణిజ్య అవసరాలకు వాడుతున్న సబ్సిడీ సిలిండర్లను, గ్యాస్ సిలిండర్లు అక్రమంగా తరలిస్తున్న ప్రజా రవాణా వాహనాలను సీజ్ చేసి, ఆయా వ్యక్తులపై కేసులు నమోదు చేయవచ్చు.

### కొరవడిన పౌరసరఫరా నిఘా

సబ్సిడీ గ్యాస్ పక్కదారి పట్టకుండా ఏజెన్సీలు, పౌరసరఫరా శాఖల అధికారులు పర్యవేక్షించాలి. ఏజెన్సీలే అక్రమ దందాలకు పాల్పడుతున్నా నిఘా అధికార యంత్రాంగం మిన్నకుండడంతో సబ్సిడీ గ్యాస్ బ్లాక్ మార్కెట్టుకు తరలిపోతుంది. అక్రమ తరలింపు, వాణిజ్య అవసరాలకు వినియోగం, అధిక ధరల వసూలు, బ్లాక్ చేసి పౌరసరఫరాకు ఆటంకం, వినియోగదారుల ప్రమేయం లేకుండా అక్రమ బుకింగ్‌లను నివారించి, అరికట్టాలని వినియోగదారులు కోరుతున్నారు. సబ్సిడీ సిలిండర్లు వేరే అవసరాలకు తరలించి, వినియోగిస్తూ ప్రభుత్వ ఆదాయంకు గండి కొడుతుండడంపై దృష్టి సారించి సబ్సిడీ గ్యాస్ దుర్వినియోగం కాకుండా అధికారులు అడ్డుకట్ట వేయవలసిన అవసరతుందని వినియోగదారులు పేర్కొంటున్నారు.

## ఎ.ఎమ్.సిలో బర్త్ డే కేక్ కట్ చేసిన ఎంపీ కేశినేని శివనాథ్




**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరం వ్యవసాయ కమిటీ యార్డ్ లో ఆదివారం ఎంపీ కేశినేని శివనాథ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు. అభిమానుల కోలాహలం నడుమ ఎంపీ కేశినేని శివనాథ్ భారీ కేక్ ను కట్ చేశారు. మైలవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు లంక లితీష్ ఎంపీ కేశినేని శివనాథ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి జ్ఞాపికను బహుకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి జంపాల సీతారామయ్యతో పాటు మైలవరం నియోజకవర్గ, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

# రైతుల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఎన్డీయే కూటమి లక్ష్యాల మేరకు సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించి రైతులకు విశేషంగా సేవలందించాలన్నారు.రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు కట్టుబడి వున్నారనన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం సాయం కలిపి తొలివిడతగా ఏడు వేల రూపాయలు రైతుల ఖాతాలో జమ చేయటం జరిగిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సదుపాయం ప్రారంభం కానుందన్నారు.అనంతరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ పొత్తులో భాగంగా మైలవరం ఏ.ఎం.సి చైర్మన్ పదవిని జనసేన పార్టీకి కేటాయించినట్లు పేర్కొన్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా జనసేన మిత్రులతో కలసి ఈ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద, ఏడాదికి రూ.20 వేల సాయం, 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్, 90 శాతం రాయితీతో పశువుల షెడ్ల నిర్మాణం, 50 శాతం రాయితీతో వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేసున్నట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్ళు చేసిన 24 గంటల్లోనే చెల్లింపులు, భూసార పరీక్షలు, సూక్ష్మ పోషకాలు అందచేత, రాయితీపై విత్తనాలు, ఎరువుల పంపిణీ, ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం, ధరల స్థిరీకరణ నిధి ద్వారా పంట కొనుగోళ్ళు ఇలా ఎన్నో కార్యక్రమాల్ని రైతుల కోసం అమలు చేసున్నట్లు వెల్లడించారు. నూతన వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ పాలకవర్గ సభ్యులు అందుబాటులో ఉండి రైతుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే వసంత



కృష్ణప్రసాద్ గారు సూచించారు.ఈ కార్యక్రమంలో రోజుకు వర్గ పరిశీలకులు దారు నాయక్, మైలవరం నియోజవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ అక్కల రామ్మోహనరావు (గాంధీ) , బీజేపీ ఇన్చార్జి నూతులపాటి బాల కోటేశ్వరరావు (బాల) , టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి జంపాల సీతారామయ్య లతో పాటు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

### మైలవరం ఏ.ఎం.సి పాలకవర్గం

వ్యవసాయ కమిటీ చైర్మన్‌గా పొనకళ్ల నవ్యశ్రీ (జనసేన), వైస్ చైర్మన్ గా చేబ్రోలు రాజు, పాలకవర్గ సభ్యులుగా బానోతు చిన్ని, మల్లాది పోతురాజు, పిన్నిబోయిన సుబ్బారావు, టి. ఉష, మరీదు పుష్పవతి, జవ్వాది నాగేశ్వరరావు, వేమిరెడ్డి పెద్ద సత్యనారాయణ రెడ్డి, జి.అనిత, షేక్ నసీమ, గరిమెళ్ళ పావని, పి.వెంకటేశ్వరరావు, ఏ.లక్ష్మీతులసి, కొండపల్లి మణికంఠలు ప్రమాణ స్వీకారం చేశారు.

# కార్మికసంఘం నేత మిక్కిలినేని పాపారావు కన్నుమూత



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** కార్మికసంఘం నేత, రైతు నాయకులు మిక్కిలినేని పాపారావు (92) శనివారం రాత్రి చల్లపల్లిలోని స్వగృహంలో కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. లక్ష్మీపురం చక్కెర కర్మాగారం కార్మిక సంఘ నేతగా కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటంచేసిన ఆయన ఆ తర్వాత రైతులు, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేశారు. ఆయన కుమారుడు మిక్కిలినేని మధు టీడీపీ సీనియర్ నాయకునిగా ఉన్నారు.

**నివాళులు అర్పించిన ఎమ్మెల్యే**

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, యువనేత మండలి వెంకట్రామ్ము ఆదివారం ఉదయం పాపారావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కార్మికనేతగా, రైతునాయకునిగా వారి సేవలు స్మరించుకున్నారు. తమ తండ్రి వెంకట కృష్ణారావుతో పాపారావుకున్న అనుబంధాన్ని బుద్ధప్రసాద్ గుర్తు చేసుకున్నారు. పాపారావు తనయుడు మధును పరామర్శించి సానుభూతిని తెలిపారు.

**ప్రముఖుల నివాళులు..** మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్బాబు, మండల టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు మోర్ల రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, ఎంపీపీ కోట విజయరాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, డీసీ ఛైర్మన్లు నిడమానూరి దిలీప కుమార్, అయినపూడి భానుప్రకాష్, జడ్పీమాజీ వైస్ఛైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, మాజీ ఎంపీపీ యార్లగడ్డ లంకబాబు, వైద్యప్రమ ఎకులు డాక్టర్ డిఆర్ కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతి, డాక్టర్ సబ్బినేని భవానీప్రసాద్, డాక్టర్ ఎన్. కీర్తి, కూటమి నేతలు పరుచూరి సుభాష్ చంద్రబోస్, మండవ బాలవర్ధిరావు, కోనేరు బలరాం, దోనేపూడి గోపీకృష్ణ, మోర్ల శివ, వేమూరి రత్నగిరి, వీరమాచనేని భవానీప్రసాద్, ప్రముకులు పరుచూరి అంజయ్య, యార్లగడ్డ శివప్రసాద్, దుబ్బుల సాంబశివరావు, గొర్రెపాటి పిచ్చేశ్వరరావు, నాదెళ్ల పూర్ణ, సబ్బినేని బోసు, కాట్రగడ్డ రామ్మోహనరావు, కెవిఆర్ఎస్.మిత్ర, వార్డుసభ్యులు మీర్ రిజ్వాన్, షేక్ సిలార్, ఆర్యవైశ్య సంఘ నేతలు అన్నవరపు పాండురంగారావు, వరదా హరిగోపాల్, కమ్యూనిస్టుపార్టీల నేతలు అడ్డాడ ప్రసాద్బాబు, హనుమానుల సురేంద్రనాధ్ బెనర్జీ, యద్దనపూడి మధు, కేసీపీ జీఎం బుల్లిపిచ్చియ్య, కార్మికసంఘ నేతలు తదితరులు పెద్దఎత్తున తరలివచ్చి పా పారావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. చల్లపల్లి మునుసబ్ వీధిలోని కుమారుడు మధు ఇంటి వద్ద నుంచీ పాపారావు భౌతికకాయాన్ని ఊరేగింపుగా స్వగ్రామం దాలిపర్రు తీసుకువెళ్లి గ్రామస్థులు సందర్శనార్థం వ్యవసాయభూమిలో అంత్యక్రియలు నిర్వహించారు.

## పిడుగుపాటుకు మహిళ మృతి

**ఇరువురికి గాయాలు - ఇరాలి గ్రామంలో అలముకున్న విషాద ఛాయలు**



**కోడూరు మేజర్ న్యూస్ :** కోడూరు మండలం పరిధిలోని ఇరాలి గ్రామానికి చెందిన గంజాల కొండలమ్మ (30) పిడుగుపాటుకు గురై ఆదివారం మృతి చెందింది. వ్యవసాయ పనులకని వెళ్లిన ఆమె విగతజీవిగా మారడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవు తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండలమ్మ,వీరబాబు దంపతులు ఒకరు మురుగు కాలువలో (చేపల) మావులు పెడుతూ,మరొకరు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు మగ పిల్లలు. కాగా రోజూలానే ఆమె ఆదివారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లారు. భర్త మావులు పెట్టడానికి వెళ్లగా, కొండలమ్మ తొటి కూలీలతో కలిసి కోడూరు శివారు నరసింహపురం గ్రామ సమీపంలో ఉన్న పొలానికి నాటుకి వెళ్లింది. అయితే ఇంతలో ఒక్కసారిగా వాతావరణం మారింది. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. అదే సమయంలో ప్రాంతంలో పిడుగు పడడంతో పిడుగు శబ్దానికి ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కొండలమ్మ అకాల మృతిని భర్త వీరబాబు,జీర్ణించుకోలేకపోతున్నాడు. ఉదయం కూలిపనికి వెళ్లిన భార్య సాయంత్రం తిరిగి ఇంటికి విగతజీవిగా వస్తుందని తెలిసి తట్టుకోలేక భోరున విలపించాడు. ఆమెతో పాటు నాటు వేస్తున్న గంజాల జ్యోతి,గంజాల పార్వతి పిడుకు తాకిడికి గాయపడగా వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.



## ఘనంగా శ్రీ శ్రీ శ్రీ మరీదు వారి అమ్మకి శ్రావణ మాస సారె



**గన్నవరం (పాత రావిచర్ల), ఆగస్టు 3, మేజర్ న్యూస్ :** ఏలూరు జిల్లా, నూజివీడు మండలంలోని పాత రావిచర్ల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ మరీదు వారి అమ్మకి శ్రావణ మాసం సందర్భంగా సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఈ కార్య క్రమంలో కమిటీ ప్రతినిధులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి సమర్పించిన సారె ఊరేగింపు గ్రామ వీధులలో కన్నులపండువగా జరిగింది. మహిళలు నోరూరించే పిండి వంటలు తయారు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. పలు గ్రామాల నుండి విచ్చేసిన మరీదు వారి ఆడపడుచులు, భక్తులు, గ్రామంలోని మరీదు ఆడపడుచులతో కలిసి గంగానమ్మ తల్లి గుడి, శ్రీరామాలయం, ఆంజనేయ స్వామి గుడి సందర్శించి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం మహిళలు సామూహికంగా ఒడిబియ్యం, సారెను సమర్పించి అమ్మవారిని పూ జించారు. కార్యక్రమ అనంతరం అన్నప్రసాద వితరణ భక్తులకు నిర్వహిం చబడింది. ఈ పవిత్ర కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, శ్రావణ మాసానికిచెందిన ఆధ్యాత్మికతను ప్రదర్శించారు.

# సంతూర్ రాయల్ తాజా టీవీ యాడ్లో మీనాక్షి చౌదరి

**ట్రిపుల్ శాండల్ కేర్ శక్తిని ప్రతిబింబిస్తూ..**

**అమరావతి, ఆగస్టు 3, మేజర్ న్యూస్ :** సంతూర్ రాయల్ విప్రో వినియోగదారుల సంరక్షణ, కాంతి అనేది ఒక ప్రీమియం సంతూర్ పోర్ట్ఫోలియో కిందకి వస్తుంది. అది కొత్త ట్రిపుల్ సాన్డిల్ ప్యాక్ ని పరిచయం చేస్తూ దాని చర్మ సంరక్షణ రేంజ్ ని విస్తరించింది. ఈ లాంచ్ ని మీనాక్షి చౌదరీ అనే నటి టీవీ కమర్షియల్ ద్వారా మద్దతుగా కనిపిస్తుంది. ఈ కొత్త ఆఫర్ మూడు ఉత్పత్తులు అయిన సోప్, స్యన్డిల్ వుడ్ ఫేస్ ప్యాక్, సాన్డిల్ ఫేస్ కరీం ని ఒక దెగ్గరకి చేరుస్తుంది, మూడు దశల చర్మ సంరక్షణలో భాగంగా మెరుగైన పనితీరు ని అందిస్తూ చర్మ సౌందర్యాన్ని పెంచుతూ నల్ల మచ్చలను తగ్గిస్తుంది. ఎం ఎస్ పరిశోధన క్లినిక్ నిర్వహించిన క్లినికల్ అధ్యయనం ప్రకారం ఒక వారం రోజుల వాడుక తరువాత మెరుగైన మెరుగుదల చూశామని అని రెజిమెన్ వివరించారు. టాన్ తగ్గడం మాత్రమే కాకుండా నాలుగో వారంలో నల్ల మచ్చలు కుడా తగ్గి మంచి కాంతిని గమనించారు. ఈ ఫార్ములా ని డెర్మటాలజీ ప్రకారం టెస్ట్ చేశారు. ఇది అన్ని రకాల చర్మాల వారికి సరిపోతుంది. ఇప్పటి యువ వినియోగదారులు వారి చర్మ సంరక్షణ గురించి ఎక్కువగా పట్టించుకోవడం లేదుబీ వారు ఈ బిజీ జీవితానికి సరిపోయే ఎలాంటి ఇబ్బంది లేని మెరుగైన పరిష్కారాలను అన్వేషిస్తున్నారు. కొత్త ట్రిపుల్ స్యాన్డిల్ ప్యాక్ అనేది పెరుగుతున్న వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని డిజైన్ చేసారు. పూర్తిగా స్యాన్డిల్ వుడ్ తో తాయారు చేసిన నమూనా అనేది సాన్డిల్ వుడ్ సీరంని కలిగి ఉంటుంది, పూర్తీ రొటీన్ యొక్క ప్యాక్ ఇక్కడ సౌకర్యవంతంగా మనకి దొరుకుతుంది. మేము పెరుగుతున్న అవసరాలకు తగ్గట్టు చర్మం గురించి ఎక్కువ జాగ్రత్త తీసుకోవాలి అనుకునే వినియోగదారులను




చేరుకోవాలి అనుకుంటున్నాం." అని విప్రో వినియోగదారుల సంరక్షకులు, లైతెనింగ్ మార్కెటింగ్ యొక్క సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అయిన ఎస్ ప్రసన్న రాయ్ లాంచ్ గురించి మాట్లాడుతూ అన్నారు. టిల్ట్ బ్రాండ్ సొల్యూషన్స్ అభివృద్ధి చేసిన ఈ టీవీ వాణిజ్య ప్రకటన ఆశ్చర్యకరమైన మలుపు తీసుకుని, ప్రేక్షకులకు ప్రముఖుల జీవితాల్లోకి ఒక స్నీక్-పీక్ ఇస్తుంది. ఒక సినిమా షూటింగ్ వెనుక, మీనాక్షి చౌదరి తన చర్మ సంరక్షణ దినచర్యను - సంతూర్ రాయల్ శాండల్ సబ్బు, ఫేస్ ప్యాక్ - తెరపై, జీవితంలో తన రోజువారీ ప్రకాశానికి కారణమని వెల్లడించడానికి ప్రేక్షకులతో నేరుగా సంభాషణ చేస్తుంది. ఈ కథనం ద్వారా, మీనాక్షి టాలీవుడ్లో ప్రధాన నటిగా వచ్చే గ్లామర్ ద్వారా దాగి ఉన్న ఒక అందమైన అమ్మాయిని కూడా వెల్లడిస్తుంది.

## అక్రమ పొగాకు వాణిజ్యాన్ని ఎదుర్కొనేందుకు జి2జి చర్చలు అవసరం



**విజయవాడ మేజర్ న్యూస్ :** అక్రమ పొగాకు వాణిజ్యాన్ని ఎదుర్కొనేందుకు సోర్స్, ట్రాన్సిట్ దేశాలతో కొనసాగుతున్న జి2జి చర్చల అవసరాన్ని ఫిలిప్ మోరిస్ ఇంటర్నేషనల్ (పీఎంఐ)లో అక్రమ వాణిజ్య నివారణ అధిపతి రోడ్నీ వాన్ డూరెన్ నొక్కి వక్కాణించారు. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన రెండు రోజుల ఏఎస్ఏఐ భద్రతా సదస్సు, ప్రదర్శనలో, నకిలీ నిరోధక, అక్రమ వాణిజ్యం, బ్రాండ్ రక్షణ గురించి ఆయన మాట్లాడుతూ చట్టాలను జారీ చేసే సంస్థలు, విధాన రూపకర్తలు, భద్రతా పరిష్కార ప్రదాతలు, యజమానులతో సహా సదస్సుకు హాజరైన ప్రతినిధులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ, అక్రమ పొగాకు ఉత్పత్తులు సప్లయ్ చెయిన్ వ్యాప్తంగా నియంత్రణ అంతరాలను, తప్పించుకునేందుకు అవకాశం ఉన్న మార్గాలను ఎలా వినియోగించుకుంటున్నాయో పూసగుచ్చినట్లు వివరించారు. ఈ సమస్యను సమర్థవంతంగా పరిష్కరించుకునేందుకు తక్షణ ప్రాధాన్యత, సంప్రదాయానికి అతీతంగా అంతర్-మంత్రిత్వ సమన్వయం అత్యవసరమని రోడ్నీ వాన్ డూరెన్ పేర్కొన్నారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఈ నెల 4వ తేదీ సోమవారం కలెక్టరేట్ లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్టు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను Meekosam.ap.gov.in వెబ్సైట్లో నమోదు చేసుకోవచ్చని.. నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చన్నారు.

## సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం

**ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈ నెల 4వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు ఇంచార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మ తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక- మీకోసం కార్యక్రమం జరుగుతుందని ఇన్చార్జి కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్ సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు.కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా ఇంచార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మ కోరారు.

## పోతురాజు స్వామి సన్నిధిలో అన్నప్రసాద వితరణ



**నాగాయలంక ఆగస్టు 3 మేజర్ న్యూస్ :** నాగాయలంక గ్రామంలోని కొత్తూరులోని బోసుబొమ్మ సెంటర్నందు కొలువైన పోతురాజు స్వామి దేవస్థాన ప్రాంగణంలో దాతల సహాయ సహకారములతో, ప్రతిఆదివారం, శుక్రవారం, విశేష పర్వదినాలలో క్రమం తప్పకుండా దేవస్థానమునకు వద్దకు వచ్చేబక్తులువారి, వారి కోరికలు నేరవేరుటచేత, వారియొక్క తల్లి, తండ్రులు, బిడ్డలు, బంధువులు, పేరునపోతురాజు స్వామివారికి, పూజా, కార్యక్రమాలు నిర్వహించి, స్వామివారికి నైవేద్యం సమర్పించి దేవస్థానకు విచ్చేసిన భక్తులకు, నిరుపేదలకు, అన్నదాన కార్యక్రమము, క్రమము తప్పకుండా, కొన్నిఏండ్లుగా నిర్వహించుచున్నారు. చెప్పుకోదగ్గ విశేషము, స్వామివారి చెంతఅన్నదానము చేయుటకు, నెలరోజులు ముందుగానే పేర్లు నమోదు చేసిన వారికి అవకాశమురావుటలేదు. కులమతాలకు అతీతంగా భక్తులకు అన్నదాన కార్యక్రమమును దేవస్థానం కమిటీవారు జరిపించుచున్నారు.

# ఘనంగా నందం రామారావు, దుద్దిళ్ళ అనిరుధ్, జన్మదిన వేడుకలు





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రముఖ కథ, నవల రచయిత, సీనియర్ పాత్రికేయులు నందం రామారావు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్ ఏకైక కుమారుడు దుద్దిళ్ళ అనిరుధ్ పుట్టినరోజును మచిలీపట్నం పదో డివిజన్ సుకర్లబాద్ లోని స్నేహాలయంలో ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంను మచిలీపట్నం విలేకరుల సమాఖ్య ఆధ్వ ర్యంలో అత్యంత వైభవంగా జరిపారు. స్నేహాలయంలోని మానసిక వికలాం గులకు, వృద్ధులకు, ఒంటరి మహిళలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. 40 సంవత్సరాలకు పైగా మచిలీపట్నంలో విలేకరిగా కొనసాగుతున్న నందం రామారావు దర్శకరత్న దాసరి నారాయణరావు ఆశీస్సులతో ఉదయం దినపత్రికతో జర్నలిస్టుగా గుర్తింపు పొందారు. అప్పట్లో నందం రాసిన కథలను చదివిన దాసరి నారాయణరావు ఆయన ప్రతిభను గుర్తించి ప్రోత్స హించారు. జర్నలిజం పై ఉన్న అభిరుచితో తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్నారు. నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం నందం. ఇక దుద్దిళ్ల అనిరుధ్ ఆగస్టు 3న పుట్టడం అదే తారీఖున నందం రామారావు జన్మించడం వల్ల ఆ ఇద్దరి జన్మదినం ను పురస్కరించుకొని ఈ వేడుకను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులలో ఒక్కరైనా బత్తుల రామకృష్ణ తెలిపారు. దుద్దిళ్ళ అనిరుధ్ తల్లి శైలజా రామయ్యార్ గతంలో ఉమ్మడి కృష్ణాజిల్లా కలెక్టర్ గా పనిచే శారు. ఉమ్మడి కృష్ణాజిల్లా మచిలీపట్నంలోనే ఉంటూ విధులు నిర్వహించే వారు. ఆమె జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడు బందరు పోర్ట్ నిర్మాణంపై ఆమె ఆధ్వర్యంలోనే బందరు మండలంలో పలు గ్రామాలలో సభలు జరిగాయి. శైలజా రామయ్యార్ కృష్ణాజిల్లా అభివృద్ధి కోసం పథకాలు సిద్ధం చేసి ఉంచారు. ఉన్నతాధికారులకు బదిలీలు తప్పవు గనుక కృష్ణాజిల్లా వచ్చిన సంవత్సరంలోపే బది లీపై వెళ్లిపోయారు. మచిలీపట్నంను శైలజారామయ్యార్ ఎంతో ఇష్టపడేవారు కనుక ఆమె కుమారుడైన దుద్దిళ్ళ అనిరుధ్ జన్మదిన వేడుకలను మచిలీపట్నంలో జరుపుకోవడానికి ప్రధాన కారణమని విలేకరులు తెలిపారు. కాగా ఈ జన్మదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పలువురు విలేకరులు విచ్చేసి నందం ఆనందంగా ఉండాలని, అనిరుధ్ తల్లిదండ్రులను ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకొని మున్ముందు విజయ శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సాక్షి రిపోర్టర్ అంబటి శేషుబాబు, ఎన్టీవీ రిపోర్టర్ కాసాని గణేష్ కుమార్, సూర్య రిపోర్టర్ సతీష్, అమరావతి రిపోర్టర్ శంకర్, 99 ఛానల్ రిపోర్టర్ కంచర్ల కృష్ణ ప్రసాద్, అనంతబులిటెన్ సుబ్రమణ్యం, నేటి మన దేశం రిపోర్టర్ శ్యామ్ కుమార్, కానుక రిపోర్టర్ సురేష్, సూర్య రిపోర్టర్ జయకర్, ఆంధ్రజ్యోతి రిపోర్టర్ ముదిగొండ శాస్త్రి, మురళి, స్నేహాలయ సిబ్బంది ప్రశాంతి, సునీత, సౌమ్య, అరుణ్ పాల్గొన్నారు.



## 592 మంది పేదలకు ఉచిత కార్పోరేట్ వైద్య సేవలు

### గుడ్లవల్లేరులో డాక్టర్ సిఎల్ ఉచిత కార్పొరేట్ వైద్య శిబిరం

### ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి, కామినేని హాస్పిటల్స్ వైద్య సేవలు

**గుడ్లవల్లేరు ఆగస్టు 3 మేజర్ న్యూస్ :** రాష్ట్ర భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సి.ఎల్ వెంకటరావు పల్లెల్లో పేద ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలను అందిస్తున్నారు. ఆదివారం జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన 592మందికి గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రోఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న రోగులకు డాక్టర్ సి.ఎల్ వెంకటరావు, నేత్ర సమస్యలకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్లు హనుమకొండ దుర్గ భవాని, కణితి శశిరేఖ, గుండె, ఊపిరితిత్తుల సమస్యలకు విజయవాడ కామినేని హాస్పిటల్ వైద్యులు డాక్టర్ భవాని, ఎస్.దాశరథి తమ వైద్య సేవలను రోగులకు అందించారు. అనంతరం అవసరమైన రోగులకు డాక్టర్ సి ఎల్ వెంకటరావు చేతుల మీదుగా ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

# తన రాజకీయ ఉనికి కోసమే నిరాధారణ ఆరోపణలు చేస్తున్న కైలే



**పెదపారుపూడి ఆగస్టు 3 మేజర్ న్యూస్ :** తన రాజకీయ ఉనికి కోసమే పామర్రు మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని పెదపారుపూడి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి (చంటి) ఆరోపించారు. పెదపారుపూడి మండలంలో కూటమి నాయకులు అవినీతికి పాల్పడుతున్నారని అక్రమంగా చెరువులు తవ్వుకుంటున్నారని కైలే అనిల్ కుమార్ చేసిన ఆరోపణల పై మండలం లోని పార్టీ నాయకులు స్పందించారు. వెంట్రప్రగడ గ్రామంలోని పార్టీ కార్యాలయంలో ఈ మేరకు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రమేష్ చౌదరి మాట్లాడుతూ పలు గ్రామాల్లో అక్రమంగా చెరువులు తవ్వి మట్టి అమ్ముకున్నామని ఆరోపించడం సరికాదన్నారు. అనిల్ కుమార్ శాసనసభ్యునిగా ఉన్న సమయంలో వెంట్రప్రగడ గ్రామంలోని మూడు చెరువులు, భూషణగుళ్ళ, నాగాపురం గ్రామాల్లోని చెరువులను తవ్విన విషయం మర్చిపోతే ఎలా అని ప్రశ్నించారు. తాను అవినీతికి పాల్పడి ఇతరులపై బురద చల్లడం తన అవివేకానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. నాగాపురంలోని చెరువు భూమి కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ అక్రమంగా తవ్వి మట్టి అమ్ముకున్నారని అటువంటిది తిరిగి ఆయన తమపై బురద చల్లడం ఆయనకే చెల్లిందని మండల లీగల్ అడ్వైజర్ గొరిపర్తి రవికుమార్ పేర్కొన్నారు. నీతి నిజాయితీలతో పని చేస్తూ గ్రామాల అభివృద్దే లక్ష్యంగా ప్రస్తుత శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పనిచేస్తున్నారని దీన్ని సహించలేని కైలే అనిల్ కుమార్ అవాస్తవాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. గత ఐదు సంవత్సరాల కాలంలో గ్రామాల్లో రోడ్ల పరిస్థితి, ప్రస్తుత 13 నెలల కాలంలో ఉన్న రోడ్ల పరిస్థితి గమనించారా అంటూ ఈ సందర్భంగా నాయకులు ప్రశ్నించారు. ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించి మాట్లాడాలని అకారణంగా నిందలు వేయడం మానుకోవాలని తెలుగుదేశం పార్టీ నాయకులు అనిల్ కుమార్ కు సూచించారు. ఈ సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, జడ్పిటిసి మాజీ సభ్యులు చిలకా ఆంజనేయులు, పార్టీ నాయకులు దగాని లెనిన్, కూచిపూడి సుబ్బయ్య, జాజుల ప్రసాద్, కలపాల కిషోర్ కుమార్, రాచూరి ప్రభుదాస్, గోగం రామారావు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే 'కైలే' పై జనసేన నేత ఘాటు విమర్శలు

**అవినీతికి మారుపేరైన మీరా అధికార పార్టీ ఎమ్మెల్యే ని విమర్శించేది...**

**మీ వెనుక క్యాడరే లేదు... అభద్రతాభావం లో ఉన్నారు.... అందుకే లేనిపోని విమర్శలు.....**

**ఎమ్మెల్యే కార్యాలయాన్ని మరోసారి విమర్శిస్తే చట్టపరమైన చర్యలు....**

**ఇసుక దోపిడీ మీరు చేసి ప్రస్తుత ఎమ్మెల్యే పై విమర్శలా...**

**బహిరంగ చర్చకు మేము సిద్ధం రండి.... అంటూ సవాల్ విసిరిన జనసేన నేత తాడిశెట్టి నరేష్**



**పామర్రు ఆగస్టు 3 మేజర్ న్యూస్ :** పామర్రు నియోజవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్ మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పై ఘాటు వ్యాఖ్యలు చేసారు. పామర్రు జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల కాలంలో అవినీతిమయంతో నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించిన కైలే అనిల్ కుమార్ ప్రస్తుత ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. అవినీతికి మారుపేరైన ఆయనలో నీతినిల్ అవినీతి ఫుల్ అంటూ ఆయన వ్యాఖ్యానించారు. క్షవరం అయిన తర్వాత వివరం వచ్చినట్లుగా ఆయన ధోరణి ఉందని, ప్రస్తుతం ఒక వేదాంతి లాగా నియోజకవర్గంలోని తహసిల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడని విమర్శించారు. యూరియా కొరత ఉందంటూ తహసిల్దార్ కార్యాల చుట్టూ తిరుగుతూ లేనిపోని విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. యూరియా డి ఏ పి అనేవి కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తాయనే విషయం కూడా ఎమ్మెల్యేగా చేసిన ఆయనకు తెలియకపోవడం విచారకరమన్నారు. ఒక యూరియా బస్తా 2670 రూపాయలు ఉంటే 2400 రూపాయలు సబ్సిడీతో 270 రూపాయలకు రైతులకు ప్రభుత్వాలు అందిస్తున్నాయన్నారు. ఈ విషయం ఆయనక తెలియకపోవడం చాలా విచారకరమన్నారు. ఇక స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పై లేనిపోని విమర్శలు చేయడం ఆయన స్థాయికి తగిన విషయం కాదన్నారు. కుమార్ రాజా ప్రజలలోకి వెళ్లే విధానాన్ని చూసి ఓర్వలేక ఫ్రస్టేషన్ లోనికి వెళ్లి ఏదేదో మాట్లాడుతున్నారని విమర్శించారు. వాస్తవంగా కైలే అనిల్ కుమార్ తన వెంట క్యాడర్ ఎంతమంది ఉన్నారు అనేది గుర్తించాలన్నారు. ఇటీవల పామర్రు మండల పార్టీ సమావేశం ఏర్పాటు చేసి కేవలం అరగంటలో ముగించిన విషయం ప్రతి ఒక్కరికి తెలిసిందే అన్నారు. దీనికి కారణం ఆయన వెనుక జనం లేకపోవడమేనని, ఎవరూ హాజరు కాకపోవడంతో సమావేశాన్ని అర్థాంతరంగా ముగించారని అన్నారు. మీ ఇంచార్జ్ పదవి పోతుందనే అభద్రతాభావంలో మీరున్నారని, మీ వెనుక ఉన్న వారే మీకు వెన్నుపోటు పొడుస్తున్నారని ఫ్రస్టేషన్ లోకి వెళ్లిపోయి ఈ డ్రామా అంత ఆడుతున్నారనే విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని నరేష్ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే, కూటమి ఎమ్మెల్యే అయిన వర్ల కుమార్ రాజా కానీ, వారి కుటుంబ సభ్యులు కానీ నీతికి నిజాయితీకి మారుపేరని, కార్యకర్తలకు అండగా ఏ విధంగా ఉండాలో వారి దగ్గర నేర్చుకోవాలన్నారు. కైలే అనిల్ కుమార్ వైసిపి పార్టీ వదిలి వర్ల కుమార్ రాజా వెనుక రెండు రోజులు తిరిగితే మూడవ రోజే ఆయన నాయకత్వంలో పని చెయ్యడానికి మీరే ఉత్సాహం చూపిస్తారని పేర్కొన్నారు. నాయకులకు, కార్యకర్తలకు ప్రజలకు ఏ విధంగా అండగా ఉండాలో ఆయన్ని చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. తోట్లవల్లూరు మండలంలో మాట్లాడుతూ ఇసుక దోపిడి జరుగుతుందని మాట్లాడుతున్నారు, కానీ మీ హయాంలో ఇసుక అందని ద్రాక్షగా ఉండగా ఈరోజు కూటమి ప్రభుత్వంలో ఇసుక కొరథ అనేది లేకుండా ఉందని స్పష్టం చేశారు. మీ ప్రభుత్వంలో జనవరిలో ధాన్యం తోలితే సంవత్సరం వరకు రైతులకు నగదు అందేది కాదని, తమకూటమి ప్రభుత్వంలో నగదు గంటల వ్యవధిలోనే రైతులకు అందించామని తెలిపారు. రైతుల మీద కపట ప్రేమ చూపిస్తున్న మీకు ఈ విషయాలు తెలియదా అంటూ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ల సారథ్యంలో రైతులకు గంటల వ్యవధిలో నగదు ఖాతాలకు జమ చేసిన ఘనత తమ ప్రభుత్వాన్నిదన్నారు. ఈ విధంగా రైతులతో మంచి ప్రభుత్వం అనిపించుకున్నామని తెలిపారు. ఎమ్మెల్యే కార్యాలయాన్ని సులభ్ కాంప్లెక్స్ తో పోలుస్తున్నారు మీకు అది సబబు కాదని హెచ్చరించారు. ఆ కార్యాలయం కూటమి ప్రభుత్వంలోని మూడు రాజకీయ పార్టీలకు చెందిన కార్యాలయంగా పేర్కొంటూ, నియోజకవర్గ ప్రగతికి నిదర్శనం ఆ కార్యాలయం అని పేర్కొన్నారు. మీరు అన్న సులబ్ కాంప్లెక్స్ అనే పదాన్ని వెనక్కి తీసుకోవాలని, అలాగే మరో మారు అటువంటి పదాలను వాడవద్దని, వాడినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా నరేష్ హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు గంప గంగాధర్, రాపర్ల ఎంపిటిసి సభ్యులు కూనపరెడ్డి సుబ్బారావు కూడా పాల్గొన్నారు.

# బడుగు బలహీన వర్గాలకు మెరుగైన వైద్య సేవలు






వత్సవాయి, ఆగస్టు 3, మేజర్ న్యూస్ : సమాజంలో పేద బడుగు బలహీన వర్గాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న సంకల్పంతో జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్దన్ వారి సొంత గ్రామం లింగాలలో హాస్పిటల్ ఆన్ వీల్స్ సంచార వైద్యశాల మాదిరి వినూత్న కార్యక్రమాన్ని రూపొందించినారు.అందులో భాగంగా గత రెండు రోజులుగా గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ను విజయవంతంగా నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో అనేక విభాగాల డాక్టర్లు పాల్గొని ప్రజలకు మెరుగైన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు.ముఖ్యంగా పెద్ద సంఖ్యలో సుమారు పరీక్షలు చేయించుకునేందుకు 784 మంది పాల్గొని వైద్య సేవలు పొందియున్నారు. వీరిలో దంత వైద్యం నకు సంబంధించి 67 మందికి,సాధారణ చికిత్సలు 210, రక్త, షుగర్ పరీక్షలు 784, ఈసీజీ 40, ఎక్సరే పరీక్షలు చికిత్సకు. 10, కంటి పరీక్షలు. 502,వీరిలో శుక్లములు.80, పొరలు ఉన్నవారు. 22, కళ్ళజోడులు అవసరమైన వారు. 318,ని గుర్తించినారు. మొత్తముగా 102 మందికి త్వరలో శంకర నేత్రాలయం విజయవాడ వారి వద్ద ఆపరేషన్లు చేయుటకు జయప్రద ఫౌండేషన్ చైర్మన్‌చే ఏర్పాట్లు జరుగుచున్నవి.ఈ కార్యక్రమంలో జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్, శంకర్ నేత్రాలయం హాస్పిటల్ ఎండి స్వాతి, రోటరీ క్లబ్ గవర్నర్ శ్రీ రామ్, రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ మధు, సిబార్ దంత వైద్య కళాశాల డాక్టర్ పి. శ్రీనివాస్ ఈ శిబిరాన్ని సందర్శించినారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ తొండపు జగన్మోహన్ రావు, గ్రామ సర్పంచ్ చల్లా విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు వేముల శివ, కోఆర్డినేటర్ వెంకట నరసింహారావు, ఈ శిబిరంలో ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు జయప్రద ఫౌండేషన్ వాలంటీర్లు వైద్య శిబిరంలో పాల్గొని వారు సేవలు అందించినారు.

## సోషల్ మీడియా రాజీనామాలపై ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఆగ్రహం



నందిగామ, ఆగస్టు 3, మేజర్ న్యూస్ : ఏపీ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆదివారం నాడు తన కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో సోషల్ మీడియా వేదికగా రాజీనామాలు ప్రకటించడం ఒక ఆనవాయితీగా మారిపోయింది. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు తమ రాజీనామాలను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ప్రకటించడం సర్వసాధారణంగా మారింది. అయితే, ఈ పరిణామంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇటువంటి సోషల్ మీడియా రాజీనామాలను చూస్తూ ఊరుకోవడం, సహించడం లేదా ఉపేక్షించడం అనేది జరగదని ఆమె స్పష్టం చేశారు.సోషల్ మీడియా ద్వారా రాజీనామాలు ప్రకటించడం వల్ల రాజకీయ వ్యవస్థలో అస్థిరత ఏర్పడుతుందని, ఇది ప్రజల్లో గందరగోళం సృష్టిస్తుందని తెలియజేస్తూ. రాజీనామా వంటి కీలక నిర్ణయాలు సోషల్ మీడియాలో ప్రకటించడం కంటే, అధికారిక వేదికల ద్వారా, నిర్మాణాత్మకంగా చర్చించి, పార్టీ అధిష్టానంతో సంప్రదించి తీసుకోవాలని ఆమె సూచించారు.సోషల్ మీడియా రాజీనామాలు కేవలం రాజకీయ డ్రామాగా మారుతున్నాయి. ఇవి ప్రజల్లో అపనమ్మకాన్ని పెంచడమే కాకుండా, పార్టీల అంతర్గత క్రమశిక్షణను దెబ్బతీస్తాయి. ఇటువంటి చర్యలను ప్రభుత్వం గానీ, పార్టీ అధిష్టానం గానీ సహించదు," అని తంగిరాల సౌమ్య మండిపడ్డారు. ఆమె మాటల్లో, రాజకీయ నాయకులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాల్సిన అవసరం ఉందని, సోషల్ మీడియాను రాజీనామాల కోసం ఉపయోగించడం వల్ల ప్రజాస్వామ్య విలువలు దెబ్బతింటాయని ఆమె వాపోయారు.పార్టీలో కష్టపడినా ప్రతిఒక్కరికి వారి కష్టానికి తగిన న్యాయం, గుర్తింపు తప్పకుండా ఉంటుంది. అలాగే వివిధ వార్డుల్లో మనం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలకు సంబంధించిన అభివృద్ధి పనులు కూడా ప్రాధాన్యత క్రమంలో తప్పక నూరు శాతం పూర్తవుతాయని అందులో ఎలాంటి సందేహం అవసరం లేదని కూటమి ప్రభుత్వం ప్రజాప్రభుత్వమని తెలియజేస్తూ, ఎటువంటి ఇబ్బంది ఉన్న అధిష్టానం దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా, ఆమె సోషల్ మీడియా దుర్వినియోగాన్ని ఖండిస్తూ, దాని నియంత్రణకు కఠిన చర్యలు అవసరమని పేర్కొన్నారు.రాజకీయ నాయకులు సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా ఉపయోగించాలని, ప్రజలకు సరైన సమాచారం అందించడంతో పాటు, పారదర్శకతను కాపాడాలని తంగిరాల సౌమ్య పిలుపునిచ్చారు. ఆమె మాటల్లోని దృఢత, సోషల్ మీడియా రాజీనామాలపై ఆమె గట్టి వైఖరిని స్పష్టంగా తెలియజేశారు. సోషల్ మీడియా వేదికగా చేసే రాజీనామాలను కూడా ఆమోదించడానికి వెనుకాడబోమని ఈ విషయంలో ప్రభుత్వం, పార్టీ అధిష్టానం తీసుకోబోయే చర్యలు చాలా కఠినంగా ఉంటాయని స్పష్టం చేశారు

## రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ నాయకుల చిత్రపటాలకు ధాన్యాభిషేకం



నందిగామ, ఆగస్టు 3, మేజర్ న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ప్రతిష్ఠాత్మక పథకం 'అన్నదాత సుఖీభవ' ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయడం జరిగింది. ఈ సందర్భంగా నందిగామ పట్టణంలోని కాకాని నగర్ ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కార్యాలయంలో రైతు సంఘ నాయకులు, మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి, తెలుగుదేశం పార్టీ తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి అమ్మినేని జాల ప్రసాద్, కూటమి నేతలతో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కృతజ్ఞతా సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు ధాన్యాభిషేకం చేస్తూ, రైతుల సంక్షేమం కోసం చేపట్టిన ఈ చరిత్రాత్మక కార్యక్రమానికి కృతజ్ఞతలు తెలిపారు.అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా రాష్ట్రంలోని 46,85,838 మంది రైతులకు ఏటా రూ. 20,000 ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ పథకం కింద రూ. 6,000కు అదనంగా, రాష్ట్ర ప్రభుత్వం రూ. 14,000ను మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తుంది. ఈ పథకం కింద సొంత భూమి కలిగిన రైతులతో పాటు, కౌలు రైతులు కూడా లబ్ధి పొందేలా మార్గదర్శకాలు రూపొందించబడ్డాయి. మొదటి విడతగా రూ. 7,000 రైతుల ఖాతాల్లో జమ చేయబడినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, "రైతన్నలు దేశానికి వెన్నెముక. వారి కష్టానికి తోడ్పాటుగా, ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా రైతులు తమ వ్యవసాయ పనులకు అవసరమైన పెట్టుబడిని సమకూర్చుకుని, ఆర్థిక స్థిరత్వం సాధించగలరు. రాష్ట్రవ్యాప్తంగా రైతన్నలు ఈ పథకం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు," అని అన్నారు. రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రైతుల సంక్షేమం కోసం అనేక చర్యలు చేపడుతున్నారు. ఈ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులతో పాటు కౌలు రైతులకు కూడా ఆర్థిక సహాయం అందుతుండటం ఆనందదాయకం," అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కూటమి నేతలు, రైతు సంఘ ప్రతినిధులు ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, రైతుల జీవనోపాధికి ఈ పథకం గొప్ప తోడ్పాటునిస్తుందని కొనియాడారు.ఈ కార్యక్రమం రైతుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం పట్ల విశ్వాసాన్ని పెంపొందించింది. రైతులు తమ వ్యవసాయ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ ఆర్థిక సహాయం దోహదపడనుందని అందరూ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వస్త్రాలంకరణ వేడుకల్లో ఎమ్మెల్యే కృష్ణప్రసాదు



జి.కొండూరు మేజర్ న్యూస్ : బొర్రా వారి నూతన వస్త్రాలంకరణ వేడుకల్లో మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు. జి.కొండూరు మండలంలోని ఆత్కూరు గ్రామ టీడీపీ నాయకులు బొర్రా వెంకటేశ్వర్‌రావు కుమార్తె బొర్రా సుగుణ నూతన వస్త్రాలంకరణ వేడుకలను వారి నివాసంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో పాల్గొన్న శాసనసభ్యులు కృష్ణప్రసాదు చిన్నారిని ఆశీర్వదించి వారికి, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్డీఏ కూటమి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే ఇష్టపడి చదవండి







గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ : స్థానిక ఎఎఎన్ఎమ్ & వివిఆర్ఎస్ఆర్ (ఇం.మీ) హై స్కూల్లో ఆదివారం స్నేహితుల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎ.ఎ.ఎన్.ఎమ్ పూర్వ విద్యార్థిని, ప్రస్తుత హైదరాబాద్‌లో ఐసిఐసిఐ బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ విధులు నిర్వహిస్తున్న బూబతిన సాయిధనూష ముఖ్య అతిథిగా విచ్చేసి, విద్యార్థులనుద్దేశించి భవిష్యత్ లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలి. అపజయాన్ని కూడా విజయంగా స్వీకరించాలని, ఈ ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో చురుకుగా పాల్గొనాలని, తమ అమూల్య సందేశాన్నందించారు. 2017-18 బ్యాచ్ పూర్వ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వివిధ రకాల ఆటలపోటీలు నిర్వహించి విజేతలైనవారికి బహుమతులు ప్రధానం చేశారు. పూర్వ విద్యార్థి అయిన దేవి యశశ్రీ, దిగ్విషాలు తమ శాస్త్రీయ నృత్యాలతో అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎన్. శ్రీనివాస మూర్తి, ప్రిన్సిపాల్ వి.ఎ.కుంజుమన్, వైస్ ప్రిన్సిపాల్ జి.యమ్.సత్య బాబు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

## సంజీవని హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు



నందిగామ, ఆగస్టు 3, మేజర్ న్యూస్: మండలంలోని అంబారుపేట గ్రామంలో వేంచేసియున్న శ్రీ సత్యమ్మ అమ్మవారి దేవస్థానం ఆవరణలో గ్రామ పెద్దలు చుండు, వాసు మంచాల మాధవరావు, కంసాని మణికంఠ ఆధ్వర్యంలో నందిగామ సంజీవని హాస్పిటల్ డాక్టర్ బొగ్గవరపు దివ్యచే ఉచిత మెగా మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి మాజీ హోంశాఖ మంత్రి వసంత నాగేశ్వరావు ప్రారంభించారు.ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు, భక్తులు సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంజీవిని ఆస్పత్రి సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.౦

## గన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పరిమి కిషోర్



గన్నవరం, ఆగస్టు 3, మేజర్ న్యూస్ : గన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పరిమి కిషోర్ బాధ్యతలు స్వీకరించారు. 2014 బ్యాచ్‌కు చెందిన పరిమి కిషోర్ ఆదివారం గన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఉప నిర్బంధిత అధికారి (ఎస్ ఐ)గా తన విధుల్లో చేరారు. పరిమి కిషోర్ గతంలో వీరులపాడు, నందిగామ, ఆగిరిపల్లి, విస్సన్నపేట, విజయవాడ సెంట్రల్ క్రైమ్ శాఖల్లో విధులు నిర్వర్తించారు. ఆయన సేవా అనుభవం, క్రమశిక్షణ గన్నవరం పోలీస్ విభాగానికి మరింత బలాన్ని చేకూరుస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.



## ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకున్న ఎం.పి

### జన్మదినం సందర్బంగా దేవాలయాల సందర్శన

### కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు

**విజయవాడ మేజర్ న్యూస్ :** విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తన జన్మదినం సందర్భంగా ఇంద్రకీలాద్రి పైన కనకదుర్గ అమ్మవారిని, శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో వినాయక స్వామిని ఆయన సతీమణి జానకి లక్ష్మీ, కుమారుడు వెంకట్, కుమార్తె స్నిగ్ధలతో ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ఈ రెండు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు అందుకున్నారు. ఎంపి కేశినేని శివనాథ్ కు కనకదుర్గమ్మ ఆలయ ఈ.వో వి.కె శీనా నాయక్ స్వాగతం చెప్పగా, మంగళ వాయిద్యాలతో ఆలయ ప్రధాన అర్చకులు వేద మంత్రోచ్చారణ తో ఆహ్వానం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఎంపి కేశినేని శివనాథ్ ను ఆయన సతీమణి జానకీ లక్ష్మిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేయగా, ఆలయ ఈ.వో వి.కె శీనా నాయక్ అమ్మవారి చిత్రపటాన్ని కేశినేని శివనాథ్ దంపతులకు అందజేశారు. ఆ తర్వాత కెనాల్ రోడ్ లోని శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలోని వినాయకుడిని ఎంపీ కేశినేని శివనాథ్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ భగవంతుడి దీవెనలు రాష్ట్ర ప్రజలపై ఉండాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటూ అభివృద్ధి పథంలో పయనించే విధంగా ఆశీర్వదించాలని ప్రార్థించినట్లు ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) తెలిపారు.

## నిరంతరం సేవ చేస్తున్న గొప్ప నాయకుడు కేశినేని



**విజయవాడ, మేజర్ న్యూస్ :** విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ చిన్ని పుట్టినరోజు సందర్భంగా జరిగిన జన్మదినోత్సవ వేడుకలలో పాల్గొని చిన్నికి టి యన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ జోన్ 3 ఇంచార్జ్ రెంటపల్లి శ్యామ్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ విజయవాడ పార్లమెంటు సభ్యులుగా ఎన్నికైన నాటినుండి ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ నిరంతరం విజయవాడ ఎన్టీఆర్ జిల్లా అభివృద్ధి కొరకై పాటుపడుతు ప్రజలకు నిరంతరం సేవ చేస్తున్న గొప్ప నాయకుడు కేశినేని శివనాథ్ అని కొనియాడారు. కేంద్రం నుండి, రాష్ట్ర ప్రభుత్వం నుండి నిధులను తీసుకొచ్చి నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న చిన్ని నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఆ సంతోషంగా జీవించాలని విజయవాడ నియోజకవర్గ ప్రజలకు మరెంతో సేవ చేయాలని విద్య, ఉపాధి, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి ఆ భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని కోరుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్టియుసి మైలవరం నియోజకవర్గ అధ్యక్షులు బురుసు శివ, విజయ డైరీ పాల ఫ్యాక్టరీ ముఠా యూనియన్ అధ్యక్షులు చప్పిడి రవీంద్ర కుమార్ యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకి నోట్ బుక్స్ పంపిణీ



**విజయవాడ మేజర్ న్యూస్ :** విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) పుట్టిన రోజు వేడుకలు టి.ఎన్.ఎస్.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.చరణ్ సాయి యాదవ్ ఆధ్వర్యంలో గొల్లపూడి లోని ఎస్.కె.సి.వి అనాథ ఆశ్రమంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి ఎంపి కేశినేని శివనాథ్ కుమారుడు కేశినేని వెంకట్ హాజరయ్యారు. అనాథ ఆశ్రమంలో చిన్నారులతో కలిసి కేశినేని వెంకట్ కేక్ కట్ చేయగ్గా విద్యార్థులందరూ ఎంపి కేశినేని శివనాథ్ కి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేశినేని వెంకట్ చిన్నారులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. అలాగే చిన్నారులకు ఉదయం అల్పాహారం ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్స్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ అడ్వైజర్ కమిటీ చైర్మన్ గొట్టుముక్కుల రఘురామరాజు, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు కరీముల్లా, టిడిపి నాయకులు రాజేష్, వడ్లమూడి వంశీ, ఆకుల సూర్యప్రకాష్, శేషుబాబు, సుధీర్ బాబు పాల్గొన్నారు.

# అంబరాన్ని అంటిన ఎంపీ పుట్టినరోజు వేడుకలు









**విజయవాడ మేజర్ న్యూస్ :** విజయవాడ పార్లమెంట్ సభ్యుడు ఎంపి కేశినేని శివనాథ్ జన్మదిన వేడుకలు ఆదివారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో అంగరంగ వైభవంగా జరిగాయి. ఆదివారం నుంచి తన కార్యాలయంలోనే ఎంపీ కేశినేని శివనాథ్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో వున్నారు. ప్రజాప్రతినిధులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ కు కార్యకర్తలు పూలాభిషేకం చేశారు.ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, రాజ్యసభ ఎంపీ సానా సతీష్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, టిడిపి అధికార ప్రతినిధి నాగుల్ మీరా, టిడిపి ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, ఎపి బిల్డింగ్స్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ అడ్వైజర్ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, టి శుభాకాంక్షలు తెలిపి ఎంపీ కేశినేని శివనాథ్ తో కేక్ కట్ చేయించారు. అలాగే ఎంపి కేశినేని శివనాథ్ కు టిడిపి యువ నాయకులు బొండా ఉమామహేశ్వరరావు తనయులు బోండా సిద్ధార్థ, బోండా రవితేజ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు కార్యకర్తలకు అందుబాటులో వుండి వారి శుభాకాంక్షలు అందుకున్నారు. తనపై ఇంత ప్రేమాభిమానులు చూపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గాన్ని జిల్లాలోని ఎమ్మెల్యేలతో కలిసి అభివృద్ధి పథం దిశగా నడిపిస్తానన్నారు.

## ఎంపికి ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య శుభాకాంక్షలు



**నందిగామ, ఆగస్టు 3, మేజర్ న్యూస్:** విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) పుట్టిన రోజు వేడుక సందర్భంగా తిరువూరు శాసనసభ్యులు కోలికపూడి శ్రీనివాసరావు నందిగామ నియోజకవర్గ తెదేపా నేతలతో కలిసి కేశినేని శివనాథ్ (చిన్ని) పుట్టినరోజు వేడుకలలో పాల్గొని కేకు కట్ చేసి శివనాథ్ (చిన్ని) కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ కోగంటి వెంకట సత్యనారాయణ బాబు, మున్సిపల్ చైర్పర్సన్ మండవ కృష్ణకుమారి, తెదేపా నేతలు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపి కేశినేని శివనాథ్ బర్త్ డే సందర్భంగా సేవా కార్యక్రమాలు



**విజయవాడ మేజర్ న్యూస్ :** విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) పుట్టిన రోజు సందర్బంగా టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్ ఆధ్వర్యంలో సెంట్రల్ నియోజకవర్గం వాంబే కాలనీ లోని మాతృదేవోభవ అనాథ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్స్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ అడ్వైజర్ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్ కి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ డైరెక్టర్ సురవరపు నాగరాజు, దాసరి కనకారావు, ఆకుల సూర్య ప్రకాష్, పుల్లగూర చరణ్ సాయి యాదవ్, జెసిబి వెంకటేశ్వరరావు, బ్రహ్మరాజు, సుధీర్ వర్మ, రాజేష్, రాజా, ఫణి కుమార్, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## నిర్మల హృదయలో బ్రేడ్, పండ్లు పంపిణీ



విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) పుట్టిన రోజు వేడుకలు 23వ డివిజన్ కార్పొరేటర్ టిడిపి ఫ్లోర్ లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి ఆధ్వర్యంలో గవర్నర్ పేట బందర్ రోడ్డులోగల నిర్మల హృదయ భవనం లో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి హాజరైన ఎంపి కేశినేని శివనాథ్ కుమారుడు కేశినేని వెంకట్ కేక్ కట్ చేశారు.. అనంతరం అనాథలకు, వృద్ధులకు ఫ్రూట్స్, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు, టిడిపి నాయకులు వసంతరావు, రవి, సూర్య, రత్నలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి రాజధానితో సమానంగా విజయవాడ అభివృద్ధికి కృషి



**విజయవాడ మేజర్ న్యూస్ :** అమరావతి రాజధానితో సమానంగా విజయవాడ పార్లమెంట్ అభివృద్ధికి ఎమ్మెల్యేల సహకారంతో కృషి చేస్తానని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాల యంలో ఎన్టీఆర్ భవన్లో ఆదివారం ఎంపీ కేశినేని శివనాథ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ విజయవాడ నగరానికి ట్రాఫిక్ సమస్యలు తీరనున్నాయన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో జాతీయరహదారి-30 లో ఇబ్రహీంపట్నం-చంద్రగూడెం మార్గంలో టూ లైన్ ఆర్.వో.బికి, విజయవాడ - మచిలీపట్నం సిక్స్ లైన్ హైవేకి కేంద్ర రోడ్లు జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేయటం జరిగిందన్నారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఎన్.హెచ్.ఐ అధికారులు, ఎంపీలతో జరిపిన జాతీయ రహదారుల సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశం లో సీఎం చంద్రబాబు అభ్యర్ధన మేరకు హైదరాబాద్ -విజయవాడ సిక్స్ లైన్ గ్రీన్ హైవే ఎక్స్ ప్రెస్ ను విజయవాడ పున్నమి ఘాట్ వరకు పొడిగిం చేందుకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అంగీకరించటమే కాకుండా, అధికారులకు ఆదేశాలు ఇవ్వటం జరిగిందన్నారు. ముందు హైదరాబాద్ -విజయవాడ సిక్స్ లైన్ హైవే ఔటర్ రింగ్ రోడ్డు వరకు మంజూరైంది. నెల రోజుల క్రితం ఆ మార్గాన్ని గొల్లపూడి వరకు పొడిగించేందుకు కృషి తను కృషి చేసినట్లు తెలిపారు. రాజధాని ప్రజలకు మరింత సౌలభ్యంగా వుండేం దుకు సీఎం చంద్రబాబు పున్నమి ఘాట్ వరకు ఆ హైవే పొడిగించాల్సిందిగా కోరటం జరిగిందన్నారు. విజయవాడలోని జాతీయ రోడ్ల అభివృద్ధికి సహక రించిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కి ఎంపీ కేశినేని శివనాథ్ ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏడాది కాలం నుంచి ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో పాటు సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారన్నారు. దీపం కింద మూడు ఉచిత సిలిండర్లు, ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం కింద ఒక్కొక్కరికి పదిహేను వేల రూపాయలు, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, అన్నదాత సుఖీభవలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు.. ఆగస్టు 15 నుంచి స్త్రీ శక్తి కింద మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణ సౌకర్యం కూడా కల్పించనున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. తనకి శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులకు, నాయకులు,కార్యకర్తలకు ఎంపీ కేశినేని శివనాథ్ ధన్యవాదాలు తెలిపారు.

# మండలి శత జయంతి వేడుకలకు సర్వం సిద్ధం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** దివిసీమ పునర్నిర్మాత, ఆర్త జన బంధువు, దివిసీమ గాంధీ, తెలుగు జాతి రత్నం, ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి స్వర్గీయ మండలి వెంకటకృష్ణారావు శతజయంతి వేడుకలు సోమవారం నుంచి ప్రపంచ వ్యాప్తంగా ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు అమెరికా సహా పలు దేశాల్లో మండలి అభిమానులు విస్తృత ఏర్పాట్లు చేశారు. మండలి వెంకట కృష్ణారావు తనయులు, అవనిగడ్డ శాసన సభ్యులు డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మండలి శత జయంతి సభలు జరుగనున్నాయి. సోమవారం ఉదయం అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ఉత్సవాల ప్రారంభ సభకు ముఖ్య అతిథిగా ఏపీ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు, రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, జిల్లాలోని ఎమ్మెల్యేలు, దేశ విదేశాల నుంచి విభిన్న రంగాల ప్రముఖులు అతిథులుగా విచ్చేయనున్నారు. ఈ సందర్భంగా గాంధీ క్షేత్రంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం, మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగే మండలి వెంకట కృష్ణారావు శత జయంతి సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆధ్యాత్మిక గురువు విశ్వయోగి విశ్వంజీ, ఆధ్యాత్మిక వక్త, ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమా మహేశ్వరరావు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని ఎమ్మెల్యేలు విచ్చేయనున్నారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో కిన్నెర ఆర్ట్స్ వారి ఆధ్వర్యంలో జరిగే సభకు హర్యానా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణ విచ్చేయనున్నారు.

సోమవారం సాయంత్రం రాజమహేంద్రవరంలో నటరాజ నృత్య నికేతన్ ఆధ్వర్యంలో జరిగే మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు విచ్చేయనున్నారు. ఆగస్ట్ 13వ తేదీ హైదరాబాద్ నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలో మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం ఆధ్వర్యంలో జరిగే మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విచ్చేయనున్నారు. దీంతోపాటు అవనిగడ్డ నియోజకవర్గంలో గ్రామగ్రామాన మండలి వెంకట కృష్ణారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు కూటమి నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

## రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం



**ఎ.కొండూరు ఆగస్టు 3 మేజర్ న్యూస్ :** తిరువూరు విజయవాడ జాతీయ రహదారిపై ఎ.కొండూరు మండలం చీమలపాడులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు దుర్మరణం చెందిన సంఘటన ఇది. సేకరించిన వివరాల ప్రకారం ఎ.కొండూరు మండలం కేశ్యా తండాకు చెందిన బాణావతు సంధ్యా నాయక్ ఆదివారం తన కుమారుడు బాణావతు యశ్వంత్(6)ను వెంటపెట్టుకొని చీమలపాడు గ్రామానికి వెళ్లి రోడ్డు దాటుతుండగా తిరువూరు వైపు నుండి విజయవాడ వైపు వెళుతున్న కారు అతివేగంగా అజాగ్రత్తగా వచ్చి ఢీకొనడంతో ముక్కుపచ్చలారని బాణావత్ యశ్వంత్ కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.తిరువూరు వైపు నుండి విజయవాడ వైపు వెళుతున్న కారు అతివేగంగా వచ్చి బాలుని ఢీకొనడంతో బాలుడు రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయమైనట్లు ప్రత్యక్ష సాక్షుల ద్వారా తెలిసింది.ఇదిలా ఉండగా కారుని డ్రైవింగ్ చేసిన యువకుడు కారుని నిర్లక్ష్యంగా అతివేగంగా డ్రైవింగ్ చేసినట్లు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు.బాలుడి తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

## ముగిసిన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ల ఘట్టం



**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ 2025 – 2028 కాలానికి జరుగనున్న ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 16వ తేదీన జరగనున్న ఎన్నికల నేపథ్యంలో, ఆదివారం మంగళగిరిలోని క్రికెట్ స్టేడియంలో నామినేషన్లు దాఖలు చేశారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పదవికి ప్రస్తుత ఏసీఏ అధ్యక్షుడు ఎంపీ కేశినేని శివనాథ్ తరుపున కర్నూల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ .కె.గోవిందరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పదవికి రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు తన నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ కి సమర్పించారు. ఏసీఏ అధ్యక్షుడు పదవికి కేశినేని శివనాథ్ , వైస్ ప్రెసిడెంట్ పదవికి బండారు నరసింహారావు, సెక్రటరీ పదవికి సానా సతీష్ బాబు, ట్రెజరర్ పదవికి దండమూడి శ్రీనివాస్ , కౌన్సిలర్ పదవికి దండు గౌర్ విష్ణు తేజ్ మాత్రమే నామినేషన్లు దాఖలు చేయగా, జాయింట్ సెక్రటరీ పదవికి బి. విజయ్ కుమార్, బి. శ్రీనివాసరాజు ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నామినేషన్స్ ఉపసంహరణ కి ఆగస్టు 11 వ తేదీ తుది గడువుగా నిర్ణయించారు. ఎన్నికల ఫలితాలు ఆగస్టు 16వ తేదీ వెలువడతాయి.

# రౌడీషీటర్‌లకు, సస్పెక్ట్‌లకు కౌన్సిలింగ్





**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమీషనరేట్ పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు పోలీసు కమిషనరేట్ పరిధిలోని అన్నీ పోలీసు స్టేషన్ల, టాస్క్ ఫోర్స్ కార్యాలయం లలో ఆయా పోలీసు అధికారులు వారి వారి సిబ్బందితో కలిసి ఆయా పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ లకు, లా & ఆర్డర్, క్రైమ్ సస్పెక్ట్ లకు, చెడునడత కలిగిన వ్యక్తులకు వివిధ సమయాలలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలలో పాల్గొనడం చేయరాదని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అంతేకాకుండా గంజాయి, ఇతర మత్తు పదార్ధాల వినియోగం, అక్రమ రవాణా చేయకుండా సత్ ప్రవర్తన మార్గంలో నడవాలని, ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలను దూరం చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఎవ్వరైనా ఎక్కడైనా గొడవలు, ఇతర నేరాలలో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.







## నాగరాజు భౌతిక కాయానికి నివాళులర్పించిన కైలే

**తోట్లవల్లూరు ఆగస్టు 3 మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన తోట్లవల్లూరు గ్రామ శివారు కలశమాలపల్లి లో అనారోగ్యంతో మృతిచెందిన నాగరాజు భౌతిక కాయానికి పామర్రు మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆ కుటుంబానికి తమ పార్టీ అండగా నిలబడుతుందని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కైలే అనిల్ కుమార్ తో పాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచి చల్లా వెంకటేశ్వరరావు మృతికి ఘనంగా నివాళులర్పించిన ఎమ్మెల్యే



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మండలంలోని హవేలి ముత్యాలంపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, చల్లా ప్రభాకరరావు తండ్రి మాజీ సర్పంచి చల్లా వెంకటేశ్వరరావు (96) ఇటీవల మృతి చెందారు. ఆయన సంస్మరణ కార్యక్రమం హెచ్.ముత్యాలంపాడు గ్రామంలో ఆయన నివాసంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ చల్లా వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చల్లా ప్రభాకరరావు ని, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు. ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నండూరి వేణు మృత దేహానికి నివాళి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందిన నండూరి వేణు (32) మృతదేహాన్ని వైఎసీపీ అభిమాని బడే గౌతం ఆదివారం సందర్శించి నివాళులర్పించారు. మండలి పరిధిలోని రామకోటిపురం గ్రామానికి చెందిన నండూరి శ్రీను కుమారుడు వేణు విద్యుత్ శాఖలో పనిచేస్తూ గత కొన్ని రోజులుగా అనారోగ్యం కారణంగా విజయవాడ మణిపాల్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మరణించారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న గౌతమ్ వారి ఇంటి వద్ద వేణు మృత దేహాన్ని సందర్శించి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ నీటి సంఘ అధ్యక్షులు వర్రే బసవ రావు, అద్దంకి శేషు,ఇతరులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన ఆలయం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** దివిసీమకు కొంగు బంగారమై కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లు తున్న గ్రామ దేవత లంకమ్మ అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున మొక్కుబడులు చెల్లించుకున్నారు విశ్వాస నామ సంవత్సరం శ్రావణమాసం దశమ ఆదివారం పురస్కరించుకొని నూతన వధువు వరులు లతో పాటు పలువురు గటం బిందె మొక్కుబడులు చెల్లించుకున్నారు ఎక్కువగా ఉండటంతో వివాహానికి ముందుగా అమ్మవారికి ఘటం బిందెలు మొక్కుబడిగా చెల్లించకోవడం ఆనవాయితీగా వస్తుంది అందులో భాగంగా మెడలో గారెల దండ నెత్తిపై ఘటం బిందె తెల్లని వస్త్రాలు ధరించి రంగులు చల్లుకొని డప్పు కోలాటలు కు అనుగుణంగా నృత్యాలు చేసుకుంటూ కర్ర స్వామితో కేరింతల కొడుతూ అమ్మవారి ఆలయ చుట్టూ ప్రదర్శన చేసి మొక్కు బడులు చెల్లించుకున్నారు మొక్కు బడులు భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రయాణం కిక్కిరిసి పోయింది భక్తులకు కావలసిన ఏర్పాట్లను ఆలయ కార్య నిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కార సాధనకు కృషి







**ఆర్టీసీ కార్మికులకు ఏపీ ఎన్జీజీఓ నిరంతర సహకారం**

**ఆర్టీసీ కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం అడుగులు కలుపుతాం**

**ఎన్ ఏమ్ యు రాష్ట్ర కార్యాలయ నిర్మాణానికి సంపూర్ణ సహకారం**

**ఏపీ ఎన్జీజీఓ నేతలు ఎ.విద్యాసాగర్, డి.వి. రమణ**

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏపీ ఎన్జీజీఓ సంఘం కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్ అన్నారు. తాడేపల్లి లోని ఆర్టీసీ ఎన్.ఎం.యు.ఏ. రాష్ట్ర కార్యాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు పివి రమణారెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో విద్యాసాగర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉండటమే ప్రధాన బలమన్నారు. ఆర్టీసీ కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం ఎన్ఎంయుఏ చేపట్టే ప్రతి కార్యక్రమంలో ఏపీ ఎన్జీజీఓ సంఘం కలిసి నడుస్తుందన్నారు. ప్రభుత్వం తలపెట్టే ప్రతి సంక్షేమ పథకం అమలు చేయడంలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్రను ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఎవరు అధికారంలో ఉన్నప్పటికీ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా సాగేందుకు ప్రభుత్వానికి సహకరిస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. సంఘం రాష్ట్ర కార్యాలయ నిర్మాణం కోసం అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఏపీ ఎన్జీజీఓ, ఏపీజేఏసీ సిద్ధంగా ఉందన్నారు. గత నాలుగు ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఆర్థిక, ఆర్థిక సమస్యలను సుదీర్ఘ కాలం పాటు పొడిగించకుండా పరిష్కారం కోసం నిర్దిష్ట కార్యాచరణ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. పీఆర్సీ కమిటీ ఏర్పాటు, డీఏల మంజూరు, బకాయిల చెల్లింపుగా ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో గత నాలుగేళ్లుగా నిలిచిపోయిన పదోన్నతులను పున ప్రారంభించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీలో 8000 పైగా ఉన్న ఉద్యోగుల ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఇటీవల ఆర్టీసీలో ప్రవేశపెడుతున్న విద్యుత్ బస్సులను ప్రభుత్వ సహకారంతో ఆర్టీసీ సంస్థ కొనుగోలు చేయాలన్నారు వాటిలో ప్రభుత్వమే కార్మికులను నియమించాలన్నారు.. ప్రస్తుతం విద్యుత్ బస్సులను ప్రైవేట్ వ్యక్తులు, వ్యాపారులు కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకిస్తున్న విధానం పునః సమీక్షించాలన్నారు. గత ప్రభుత్వం నిలిపివేసిన స్టాఫ్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ స్కీమ్స్ విధానాన్ని ప్రభుత్వం సమీక్షించి లోటుపాట్లను సవరించి మళ్లీ అమలు చేయాలన్నారు. ఎన్.ఎం.యు.ఏ. రాష్ట్ర అధ్యక్షులు పీవీ రమణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పాటు అయిన కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగంగా "మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం" పథకాన్ని దిగ్విజయంగా అమలు చేసేందుకు ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వానికి సంపూర్ణంగా సహకరిస్తారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ బస్సు డిపోలలో ఉన్న గ్యారేజీలను ఆధునికీకరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఎన్.ఎం.యు.ఏ. ప్రధాన కార్యదర్శి వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి రాజేష్ కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాసరాజు, సూర్యచంద్రరావు, పీవీ శివారెడ్డి, ఎన్.వి. రమణ, ఎన్. భాస్కర నాయుడు తదితరులతో సహా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి అధ్యక్ష, కార్యదర్శులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యూరియా కొరతను నివారించి రైతులను ఆదుకోండి : మాజీ ఎమ్మెల్యే కైలే



**తోట్లవల్లూరు ఆగస్టు 3 మేజర్ న్యూస్:** యూరియా కొరతను నివారించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతూ పామర్రు నియోజవర్గం మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ తోట్లవల్లూరు తహసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. తహసిల్దార్ కుసుమకుమారికి వినతిపత్రం అందించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతులకు యూరియా కష్టాలు వచ్చాయని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్లో రైతులకు యూరియా ఎక్కువగా అవసరం ఉందన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా లేకపోవటం దారుణమన్నారు. పీఏసీఎస్ల వద్ద రైతులు గంటల తరబడి నిలబడినా రెండు బస్తాల యూరియా ఇవ్వట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బ్లాక్ మార్కెట్లో యూరియా బస్తాను ఎక్కువ ధరలకు అమ్మి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. అధికారులు స్పందించి యూరియా కొరత లేకుండా చూడాలని ఈ సందర్భంగా తహసిల్దార్ కుసుమ కుమారికి కైలే అనిల్ విన్నవించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## మచిలీపట్నం రైల్వే స్టేషన్‌పై గతంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలుపరచాలి

**మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న మచిలీపట్నం ఎం.పీ వల్లభనేని బాలసౌరి మచిలీపట్నం రైల్వే స్టేషన్ పై గతంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలుపరచాలని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ డిమాండ్ చేశారు. మచిలీపట్నం రైల్వే స్టేషన్ లో వృద్ధులు, మహిళలు పిల్లలు కోసం లిఫ్ట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి సంవత్సరం దాటుతున్న నేటికీ ఏ విధమైన పని ప్రారంభించకపోవడం శోచనీయమని బాలాజీ అన్నారు. మచిలీపట్నంలో లిఫ్టు, ఎక్స్లేటర్ లేకపోవటం వలన రైల్వే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బాలాజీ అన్నారు. అభివృద్ధి పరిచిన ఇతర రైల్వే స్టేషన్లలో లిఫ్టులు ఏర్పాటు చేసి మచిలీపట్నంలో లిఫ్ట్ ఏర్పాటు చేయకపోవడం సమంజసం కాదని దీనిపై రైల్వే ఉన్నత అధికారులతో ఎంపీ చర్చలు జరపాలని బాలాజీ కోరారు. విశాఖపట్నం ట్రైన్ కి వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయని బాలాజీ అన్నారు. విజయవాడ నుండి మచిలీపట్నానికి రైల్వే లైన్లు డబల్ లైన్ వేసిన విశాఖపట్నం ట్రైన్‌ను గుడివాడలో గంట వరకు ప్రతిరోజు నిలిపివేయటం రైల్వే అధికారులు పూర్తి నిర్లక్ష్యం అని దానిపై ఎంపీ స్పందించాలని బాలాజీ డిమాండ్ చేశారు. విశాఖపట్నం రైలుకు నిల్వ కూలీలు రోల్డ్ గోల్డ్ వ్యాపారస్తులు, విద్యార్థులు ప్రతిరోజు ప్రయాణం చేస్తున్న విషయం గమనించాలని బాలాజీ అన్నారు. మచిలీపట్నం నుండి రద్దయిన తిరుపతి రైలును తిరిగి వచ్చే విధంగానూ గతంలో మంజూరు కాబడిన మచిలీపట్నం ముంబై ట్రైన్ ను రైల్వే మంత్రితో మాట్లాడి తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని బాలాజీ కోరారు. పెరిగిన రద్దీ దృష్ట్యా మచిలీపట్నం విజయవాడకు ప్రతి రెండు గంటలకు గుడ్లవల్లేరు గుడివాడ టూ స్టాప్ ట్రైను ఏర్పాటు చేయాలని బాలాజీ కోరారు. మచిలీపట్నం రైల్వే స్టేషన్లో రైల్వే పోలీసులు పర్యవేక్షణ లోపంగా ఉందని రాత్రివేళలో విజయవాడ నుంచి వచ్చే ట్రైన్‌లో ప్రయాణికులకు భద్రత కరువైందని బాలాజీ అన్నారు. మచిలీపట్నంలో వృద్ధుల కోసం కేవలం ఒక వీల్ చైర్ పెట్టి 200 రూపాయలు వసూలు చేయటం సరైన చర్య కాదని వృద్ధుల కోసం ఉచితంగా వీల్ చెయ్ ఏర్పాటు చేయాలని బాలాజీ డిమాండ్ చేశారు. మచిలీపట్నం బీదర్ కు నూతన రైలు ఏర్పాటు చేసినందుకు ఆయన ఎంపీ కు అభినందనలు తెలియజేశారు. కృష్ణాజిల్లాలో రోడ్ల అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు నిధులు కేంద్రం నుంచి తీసుకువచ్చిన పార్లమెంటు సభ్యులు రైల్వే ప్రయాణికులు సదుపాయాలు పట్ల కూడా దృష్టి సారించాలని బాలాజీ కోరారు. రాత్రి 8 గంటల 40 నిమిషాలకు వెళ్లవలసిన బీదర్ ఎక్స్ప్రెస్ ను సాయంత్రం 5:30 కి మచిలీపట్నం ఒకటో నెంబర్ ప్లాట్ఫారంలో పెట్టడం వలన, మచిలీపట్నం వచ్చే రెండు రైళ్లను మూడో నెంబర్ ప్లాట్ఫారంకి తరలిస్తున్నారు. దాని వలన ప్రయాణికులు విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. బీదర్ ట్రైనుని ప్రయాణ సమయానికి అంటే గంట ముందు పెడితే సరిపోతుంది అని బాలాజీ సూచించారు.



## మహితా పబ్లిక్ స్కూల్‌లో గ్రీన్ డే సెలబ్రేషన్స్

**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** స్థానిక మహితా పబ్లిక్ స్కూల్‌లో సందర్భంగా గ్రీన్ డేను ఎల్ కె జి, యు.కె.జి చిన్నారులు జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముఖ్య అతిథిగా చైర్మన్ జె.సుధాకర్ రెడ్డి, డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ వరలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులకు, టీచర్లకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ వరలక్ష్మి మాట్లాడుతూ చిన్నారులతో ముచ్చటిస్తూ మానవ జీవనంలో, ప్రకృతిలో పచ్చ(గ్రీన్) రంగు ప్రాధాన్యత, ప్రయోజనాలు గురించి చిన్నారులకు వివరించారు. విద్యార్థులు పచ్చ రంగు దుస్తులు ధరించి, అవే రంగు పుష్పాలు, జీవాలు, పండ్లు, కూరగాయలు సేకరించి ప్రదర్శించారు. వాటి రూపాలను విచిత్ర వేష దారణలతో వివరించారు. పచ్చ రంగుకు సంబంధించిన రైమ్స్ నృత్య రూపకంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని అకాడమిక్ డీన్ డి.సురేష్ కుమార్ రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ ఏ.గంగా, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

## శ్రీ కొండలమ్మ గుడిలో ఆగస్టు 15న వరలక్ష్మి వ్రతాలు



**గుడ్లవల్లేరు ఆగస్టు 3 మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా, గుడ్లవల్లేరు మండలం, వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రావణమాసం ఆదివారం భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తరించినారు. శ్రీ అమ్మవారిని సుమారు 20,000 మంది పైగా భక్తులు దర్శించుకొనినారు. అత్యధిక స్థాయిలో భక్తులు శ్రీ అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి యొక్క మొక్కుబడులు తీర్చుకొనినారు. శ్రీ అమ్మవారి దేవస్థానముకు విచ్చేసిన భక్తులకు తాగు నీరు, శానిటేషన్ ఏర్పాట్లు, ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకొనుటకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు పర్యవేక్షించారు. శ్రీ అమ్మవారిని దర్శించుకొనుటకు విచ్చేసిన భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేయటమైనది. శ్రీ కొండలమ్మ అమ్మవారి దర్శనమునకు విచ్చేసిన భక్తులకు ఏ విధమైన అసౌకర్యములు, అవాంఛనీయ, సంఘటనలు కలగకుండా గుడ్లవల్లేరు ఎస్ఐ, వారి సిబ్బంది తగు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

**1లక్ష 40వేల వెండి కిరీటం బహుకరణ**

కాకినాడ వాస్తవ్యులు పిల్లి శ్రీనివాసులు, సంధ్య, చి.విహిత కుటుంబం శ్రీ కొండలమ్మ అమ్మవారికి సుమారు రూ.1,40,000లు విలువ గల వెండి కిరీటం బహుకరించినారు. వారికి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

**3వ శుక్రవారము (ది.15-08-2025) సామూహిక వరలక్ష్మి వ్రతములు:**

ది.15.08.2025 శ్రావణ మాసం 3వ శుక్రవారం సందర్భముగా శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో మహిళామణులచే సామూహిక వరలక్ష్మి వ్రతములు జరుగును. వ్రతములో పాల్గొను మహిళా భక్తులు ముందుగా రూ.516లు చెల్లించి రశీదు తీసుకుని పేరు నమోదు చేసుకోవాలని కోరుతున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు.

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు
చందర్లపాడు, ఇబ్రహీంపట్నం, మైలవరం,
విసన్నపేట, గంపలగూడెం మండలాల్లో
పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999